# 179 బిడ్లు.. రూ.56.74 కోట్లు

## చిన్నతరహా ఖనిజాల మొదటి దశ వేలం పూర్తి

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చిన్న తరహా ఖనిజాల మొదటి దశ వేలం విజయవంతంగా పూర్తయినట్టు గనుల శాఖ ప్రకటించింది. దీనిలో భాగంగా మూడు ఖనిజాలకు సంబంధించిన 25 బ్లాకుల్లో 19 బ్లాకులకు ఈ నెల 23 నుంచి 27 వరకు నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో రూ.56.74 కోట్లకు బిడ్లు దాఖలైనట్టు వెల్లడించింది. వీటిలో ఓ కలర్ గ్రానైట్ బ్లాక్ (3.61 హెక్టార్లు)తోపాటు 4 లాటరైట్ బ్లాకులు (15.834 హెక్టార్లు), 14 స్టోన్ అండ్ మెటల్ బ్లాకులు (47.125 హెకార్లు) ఉన్నట్టు వివరించింది. వీటి రిజర్వు ధర రూ.5,63,62,600గా నిర్ణయించగా.. తుది బిడ్ మొత్తం రూ.56,74,12,600గా ఉన్నట్టు తెలిపింది. మొత్తం 179 బిడ్లు దాఖలైనట్టు పేర్కొన్నది. ఇక ప్రతినెలా ఖనిజాల వేలం నిర్వహించాలని భావిస్తున్నది.

### వేలం వేసిన ఖనిజాల వివరాలు

| ఖనిజం | వేలం వేసిన బ్లాకులు | టీక్యూబీల సంఖ్య | రిజర్వు ధర (రూ.) | తుది బిడ్ మొత్తం (రూ.) |
|---|---|---|---|---|
| కలర్ గ్రానైట్ | 1 | 5 | 29,04,000 | 4,99,79,000 |
| లాటరైట్ | 4 | 39 | 63,33,600 | 15,89,58,600 |
| స్టోన్ అండ్ మెటల్ | 14 | 84 | 4,71,25,000 | 35,84,75,000 |
| మొత్తం | 19 | 128 | 5,63,62,600 | 56,74,12,600 |

# గ్రాన్యూల్స్ లాభం 152 కోట్లు

హైదరాబాద్, మే 28: ప్రముఖ ఫార్మా దిగ్గజం గ్రాన్యూల్స్ ఇండియా నికర లాభంలో 17 శాతం వృద్ధిని కనబరిచింది. ఫార్ములేషన్ విభాగంలో అమ్మకాలు భారీగా పుంజుకోవడంతో గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.152 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.130 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.1,176 కోట్ల నుంచి రూ.1,197 కోట్లకు పెరిగినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.4,482 కోట్ల ఆదాయంపై రూ.501 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని గడించింది. మరోవైపు రూ.1 ముఖ విలువ కలిగిన షేరుకు రూ.1.5 తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.



# పారిశ్రామికానికి బీటలు

## ఎనిమిది నెలల కనిష్ఠస్థాయికి పడిపోయిన వృద్ధి

- ఏప్రిల్ నెలలో 2.7 శాతంగా నమోదైన ఐఐపీ
- గతేడాదితో పోలిస్తే పడిపోయిన ప్రగతి

న్యూఢిల్లీ, మే 28: పారిశ్రామికం మళ్లీ పడకేసింది. ఆర్థిక వృద్ధిలో నాలుగో స్థానానికి చేరుకోనున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ సర్కార్‌కు పారిశ్రామిక ప్రగతి రూపంలో గట్టి షాక్ తగిలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే ఢీలాపడింది. రికార్డు స్థాయిలో పెరుగుతూ వచ్చిన పారిశ్రామిక ప్రగతికి బ్రేకులు పడ్డాయి. తయారీ రంగంతో పాటు గనులు, విద్యుత్ రంగాలు నిరాశాజనక పనితీరు కనబర్చడంతో ఐఐపీ ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఏప్రిల్ నెలలో కేవలం 2.7 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 5.2 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. మార్చి నెలలో నమోదైన వృద్ధి రేటును మళ్లీ సవరించింది. గతంలో 3 శాతంగా ఉంటుందని అంచనాను విడుదల చేసిన గణాంకాల శాఖ ఈసారి దీనిని 3.9 శాతానికి సవరించింది.

### ఢీలా పడిన తయారీ, గనులు

దేశ వృద్ధి, పారిశ్రామిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న తయారీ రంగంలో నిస్తేజం ఆవహించింది. గత కొన్ని నెలలుగా పరుగులు పెట్టిన తయారీ రంగం వెనుకంజవేసింది. గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి 3.4 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 4.2 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. దీంతోపాటు గనుల రంగంలో వృద్ధి ప్రతికూలానికి పడిపోయింది. దేశవ్యాప్తంగా ఉన్న గనుల్లో ఖనిజ ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి మైనస్ 0.2 శాతానికి పడిపోయింది. అంతక్రితం ఏడాది ఇది 6.8 శాతంగా నమోదైంది. అలాగే విద్యుత్ రంగంలో వృద్ధి ఒక్క శాతానికి పరిమితమైంది. ఏప్రిల్ 2024లో ఇది 10.2 శాతంగా ఉన్నది.

### క్యాపిటల్ గూడ్స్ సెగ్మెంట్ ఫర్వాలేదు..

ఇతర రంగాలతో పోలిస్తే క్యాపిటల్ గూడ్స్ రంగం అంచనాలకుమించి రాణించింది. గత నెలలో ఈ రంగంలో వృద్ధి 20.3 శాతంగా నమోదైంది. ఏడాది క్రితం ఇదే నెలలో నమోదైన 2.8 శాతంతో పోలిస్తే భారీగా పెరిగింది. ఏడాది క్రితం ఇదే నెలలో 10.5 శాతం వృద్ధిని కనబరిచిన కన్జ్యూమర్ డ్యూరబుల్ విభాగం ఈసారికిగాను 6.4 శాతంతో సరిపెట్టుకున్నది. మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాలు కూడా పడకేశాయి. ఈ రెండు విభాగాలు నాలుగు శాతం వృద్ధితో సరిపెట్టుకున్నాయి. గతేడాది వచ్చిన వృద్ధి 8.5 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. ప్రాథమిక వస్తువులు 0.4 శాతం మాత్రమే కనబరిచాయి.


### కీలక రంగాలది అదే దారి

కీలక రంగాలు ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఏప్రిల్ నెలకుగాను ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి పడిపోతూ 0.5 శాతంగా నమోదైంది. క్రూడాయిల్, సహజ వాయువు రంగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కారణం. ప్రతీకార సుంకాలపై అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో గతేడాది 4.6 శాతంగా నమోదైన వృద్ధి ఈసారి తిరోగమన బాటపట్టింది.



| రంగం | ఏప్రిల్-2025 | ఏప్రిల్-2024 |
|---|---|---|
| పారిశ్రామిక వృద్ధి | 2.7% | 5.2% |
| తయారీరంగ వృద్ధి | 3.4% | 4.2% |
| గనుల రంగం వృద్ధి | -0.2% | 6.8% |
| విద్యుత్ రంగం | 1% | 10.2% |
| ఇన్‌ఫ్రాస్ట్రక్చర్/నిర్మాణ రంగం | 4% | 8.4% |
| ప్రాథమిక వస్తువుల రంగం అవుట్‌పుట్ | -0.4% | 7% |

# రెండోరోజూ నష్టాల్లో సూచీలు



ముంబై, మే 28: స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టపోయాయి. ఎఫ్‌ఎంసీజీ రంగ సంస్థ ఐటీసీ షేరు కుదేలవడం మొత్తం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. ఒక దశలో 300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 239.31 పాయింట్లు కోల్పోయి 81,312.32 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్‌ఎస్ఈ నిఫ్టీ 73.75 పాయింట్లు కోల్పోయి 24,752.45 వద్ద స్థిరపడింది. ఈవారంలోనే జీడీపీ గణాంకాలతోపాటు పారిశ్రామిక సూచీ విడుదలకానుండటంతో మదుపరులు అప్రమత్తకు మొగ్గుచూపారు. ఫలితంగా ఎఫ్‌ఎంసీజీ, వాహన, ఫార్మా రంగ షేర్లు పతనం చెందగా..బ్యాంకింగ్, పీఎస్‌యూ, మీడియా, ఎనర్జీ రంగ షేర్లు కదం తొక్కాయి. బ్రిటిష్ మల్టీనేషనల్ బీఏటీ సంస్థ ఐటీసీలో తన వాటాను 2.5 శాతం మేర తగ్గించుకుంటున్నట్టు ప్రకటించడంతో ఐటీసీ షేరు కుప్పకూలింది. ఒక దశలో ఐదు శాతానికి పైగా నష్టపోయిన షేరు చివరకు 3 శాతం నష్టపోయింది. దీంతోపాటు ఇండస్‌ఇండ్ బ్యాంక్, నెస్లె, అల్ట్రాటెక్, మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా షేర్లు పతనం చెందాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా ఎఫ్‌ఎంసీజీ 1.33 శాతం నష్టపోగా, మెటల్, వాహన, కన్జ్యూమర్ డ్యూరబుల్, కమోడిటీస్ షేర్లు దిగువముఖం పట్టాయి. కానీ, ఆర్థిక సేవలు, ఇండస్ట్రియల్స్, టెలికాం, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.

## డీ-మెర్జ్ కానున్న బీఏఎస్ఎఫ్

హైదరాబాద్, మే 28: ప్రముఖ పురుగుల మందుల తయారీ సంస్థ బీఏఎస్ఎఫ్..దేశీయ మార్కెట్లోకి మరో రెండు రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చింది. వరి పంటపై వచ్చే పాముపొడ తెగులు నివారణ కోసం వాలెక్సియోతోపాటు సుడి దోమను నియంత్రించే శిలీంధ్రనాశిని మిబెల్యాను ప్రవేశపెట్టినట్టు కంపెనీ బిజినెస్ డైరెక్టర్ గిరిధర్ తెలిపారు. వీటిలో వాలెక్సియో 60 ఎంఎల్ ధర రూ.1,750గాను, మిబెల్యా 120 ఎంఎల్ ధర రూ.1.090గా నిర్ణయించింది. వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే మూడు నుంచి నాలుగేండ్లలో ప్రతియేటా 2 ఉత్పత్తుల చొప్పున 10 రకాల కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తుల విభాగాన్ని వేరుచేసే ప్రక్రియ కొనసాగుతున్నదని, వచ్చే 18 నుంచి 24 నెలల్లో ఇది పూర్తికానున్నట్టు చెప్పారు.

# ఎస్బీఐ 26 వేల కోట్ల రైటాఫ్

**2024-25లో భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేసిన బ్యాంకింగ్ దిగ్గజం**






న్యూఢిల్లీ, మే 28: ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ బ్యాంకులు భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేశాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వరంగ బ్యాంకుల కన్నా ప్రైవేట్ రంగ బ్యాంకులు అన్ సెక్యూర్డ్ రుణాలను పెద్దమొత్తంలో రైటాఫ్ చేశాయి. వీటిలో దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అత్యధికంగా రూ.26 వేల కోట్లకు పైగా రుణాలను తన బ్యాలెన్స్ షీట్స్ నుంచి తీసివేసింది. అంతక్రితం ఏడాది రైటాఫ్ చేసిన రూ.17,645 కోట్లతో పోలిస్తే ఇంచుమించు రూ.10 వేల కోట్లకు పెరిగాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకులు అధిక మొత్తంలో రుణాలను రైటాఫ్ చేయడం విశేషం. గతేడాది ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9,271 కోట్ల రుణాలను తన ఖాతా పుస్తకం నుంచి తొలగించింది. 2023-24లో రైటాఫ్ చేసిన రూ.6,091 కోట్ల కంటే ఇది 50 శాతం అధికం. అలాగే యాక్సిస్ బ్యాంక్ కూడా రూ.11,833 కోట్ల మొండి బకాయిలను తన ఖాతాలోంచి తీసివేసింది.

### ఎంఎస్‌ఎంఈ, వ్యవసాయ రుణాలే..

చిన్నస్థాయి రుణాలు తీసుకొని ఎగ్గొట్టే వారు అధికంగా ఉంటున్నారని రిజర్వు బ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. వీటిలో ఎంఎస్‌ఎంఈ, వ్యవసాయ రంగాల్లో అత్యధికంగా ఉంటున్నాయని, వీటిని తగ్గించడానికి బ్యాంకులు పెద్దగా చర్యలు తీసుకోవడం లేదని హెచ్చరిస్తున్నది. పూచీకత్తు లేకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నాయని, వీటి వల్ల ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులపై ప్రతికూల ప్రభావం పడనున్నదని గతంలోనే రిజర్వు బ్యాంక్ హెచ్చరించింది. అయినప్పటికీ బ్యాంకులు రుణాలు ఇవ్వడం మానడం లేదు. కఠిన నిబంధనలు విధించడం వల్ల బ్యాంకుల రుణ వితరణకు బ్రేక్‌లు వేయవచ్చునని, దీనివల్ల చిన్న వ్యాపారాలు, వ్యక్తులు, రుణాలు పొందడం కష్టతరం కానున్నది. అయినప్పటికీ గడిచిన మూడేండ్లలో రైటాఫ్ అయిన రుణాల్లో 20 శాతం రికవరి కావడం విశేషం.

# శిశువిక్రయ ముఠా గుట్టురట్టు

- 13 మంది ముఠా సభ్యుల అరెస్ట్
- 10 మంది చిన్నారులను నల్లగొండ బాలల సంక్షేమ కేంద్రానికి అప్పగింత
- పోలీస్ స్టేషన్ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన
- అహ్మదాబాద్, ముంబై నుంచి చిన్నారుల కొనుగోళ్లు
- వివరాలను వెల్లడించిన ఎస్పీ



సూర్యాపేటలో పిల్లలను విక్రయిస్తున్న ముఠా వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట, మే 28: ఇతర రాష్ట్రాల నుంచి శిశువులను కొనుగోలు చేసి, పిల్లలు లేని దంపతులకు అక్రమంగా విక్రయిస్తున్న ముఠాగుట్టును సూర్యాపేట పోలీసులు రట్టు చేశారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నరసింహ వివరాలను మీడియాకు వెల్లడించారు. జిల్లా కేంద్రంలో అక్రమంగా శిశువులను కొనుగోలుచేసి దత్తత తీసుకుంటున్నట్టు విశ్వసనీయ సమాచారంతో సూర్యాపేట డీఎస్పీ ఆధ్వర్యంలో సూర్యాపేట సీసీఎస్ సీఐ, రూరల్ సీఐ ఆధ్వర్యంలో అంజయ్య, నాగయ్యను అరెస్ట్‌చేసి విచారణ చేయగా ముఠావిక్రయాలు బయటపడ్డాయి. వారి సమాచారం మేరకు జిల్లా కేంద్రానికి చెందిన నక్క యాదగిరి, ఉమారాణిని పోలీసులు విచారణ చేయగా 13 మందితో కూడిన ముఠా సభ్యుల దందా బయటపడింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్, మహారాష్ట్రలోని ముంబై నుంచి శిశువులను రూ. 5 లక్షల నుంచి 10 లక్షల వరకు కొనుగోలు చేసి పిల్లలు లేనివారికి కమీషన్ల రూపంలో విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన నక్క యాదగిరి, నక్క ఉమారాణి ఆటోలో తిరుగుతూ కోడిగుడ్లు అమ్ముకుంటూ.. సంతానంలేని దంపతులను గుర్తించి కమీషన్ తీసుకుని శిశు విక్రయాలకు పాల్పడుతున్నారు. విజయవాడకు చెందిన కోరే నాగేందర్‌కుమార్, దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన సభావత్ శ్రీనివాస్ మధ్యవర్తిత్వం ద్వారా శిశువులను దత్తత ఇచ్చారు. వీరితో పాటు విజయవాడకు చెందిన కొట్టే రమాలక్ష్మి, పిల్లల పావని, గిరికముక్కు విజయలక్ష్మి, ఆముదాలపల్లి సత్యమణి, నాగరకర్నూల్ జిల్లాకు చెందిన ముదావత్ రాజు, హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన ఐతా శోభారాణి, రాజస్థాన్‌కు చెందిన ఖాన్‌షాహీనా, హైదరాబాద్ తిరుమలగిరికి చెందిన సహనా, హైటెక్‌సిటీకి చెందిన ఈర్పుల సునీత సభ్యులుగా శిశువిక్రయాలకు పాల్పడుతున్నారు. వీరందరినీ సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో అరెస్ట్ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు హైదరాబాద్‌లో 10 మంది శిశువులను విక్రయించగా.. అందులో ఏడుగురు మగ, ముగ్గురు ఆడ శిశువులు ఉన్నారు. సూర్యాపేట మండలం టేకుమట్లలో ఇద్దరు బాలురు, సూర్యాపేట పట్టణంలో ఇద్దరు బాలికలు, పెన్‌పహాడ్‌లో ఒక బాలుడు, సూర్యాపేట జిల్లా ఉప్పలపహాడ్‌లో ఇద్దరు బాలురు, నల్లగొండ జిల్లా చిన్నసూరారంలో ఒక బాలిక, హైదరాబాద్‌లో ఒక బాలికను అమ్మినట్టు తేలడంతో వారిని గుర్తించి నల్లగొండలోని బాలల సంక్షేమ కేంద్రానికి తరలించారు. కాగా దత్తత తీసుకున్న తల్లిదండ్రులు చిన్నారుల కోసం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఆస్తులన్నీ వారిపేరు మీద రాస్తాం .. పిల్లలను అప్పగించండి అంటూ పోలీసులను వేడుకున్నారు.

## శ్రవణ్‌కుమార్ బెయిల్ పిటిషన్ ఉపసంహరణ

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): అఖండ ఇన్‌ఫ్రాటెక్-ఎకోర్ ఇండస్ట్రీస్ కంపెనీలకు మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీల కేసులో బెయిల్ కోసం 'ఐ న్యూస్' చానల్ ఎండీ, ఇన్‌రిథమ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ఉపసంహరించుకున్నారు. బుధవారం ఆ పిటిషన్ వేసవి సెలవుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్ ముందుకు వచ్చింది. దానిపై విచారణ జరించేందుకు జస్టిస్ శరత్ నిరాకరిస్తూ.. విచారణ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. దీంతో ఆ వ్యాజ్యం జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనానికి బదిలీ అయింది. న్యాయమూర్తి విచారణ చేపట్టడానికి ముందే శ్రవణ్‌కుమార్‌రావు పిటిషన్ ఉపసంహరించుకుంటున్నట్టు ఆయన తరపు న్యాయవాది చెప్పారు.

## ఎన్‌ఐజీఎస్‌టీకి సీబీసీ గుర్తింపు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియో-ఇన్ఫర్మేటిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థకు ఢిల్లీలోని కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ప్రతిష్ఠాత్మక అక్రెడిటేషన్ హోదాను మంజూరు చేసింది. సీహెచ్ వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలోని సీబీసీ నిపుణుల బృందం ఈ నెల 27, 28న ఆన్-సైట్ అసెస్‌మెంట్ నిర్వహించిన అనంతరం 8 ప్రధాన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ హోదాను కల్పించినట్టు ఎన్‌ఐజీఎస్‌టీ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఎన్‌ఐజీఎస్‌టీని జియోస్పేషియల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దాలని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సూచించారు.

## పోలీసులపై ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): ఏపీ తెనాలిలో దళిత యువకులను చితకబాదిన పోలీసులపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు అందింది. ముగ్గురు దళిత యువకులను నడిరోడ్డుపై పోలీసులు కొట్టారని, వారిపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది ఎన్‌హెచ్‌ఆర్సీకి బుధవారం ఫిర్యాదుచేశారు. ఎన్‌హెచ్‌ఆర్సీ త్వరలోనే విచారణ చేపడతామని వెల్లడించింది. దళిత యువకులను పోలీసులు రోడ్డుపై కొట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే.


ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ అంతిమయాత్రలో పాడె మోస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

# అశ్రునయనాల మధ్య మదన్‌లాల్ అంతిమయాత్ర

- పాడె మోసిన ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ
- జనసంద్రంగా మారిన మదన్‌లాల్ స్వగ్రామం ఈర్లపూడి

ఖమ్మం, మే 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బానోతు మదన్‌లాల్‌కు అశ్రునయనాల మధ్య కన్నీటి వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో మదన్‌లాల్ గుండెపోటుతో సోమవారం అర్ధరాత్రి మృతిచెందిన విషయం విదితమే. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు మంగళవారం ఖమ్మంలోని స్వగృహానికి తరలించగా బీఆర్‌ఎస్ నేతలు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. బుధవారం స్వగ్రామమైన రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో అంత్యక్రియలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాడె మోశారు. బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలు కడసారి చూపు కోసం పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, తాటి వెంకటేశ్వర్లు, బానోతు హరిప్రియ, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేందర్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, డీసీసీబీ మాజీ చైర్మన్ నాగభూషణం, బీఆర్‌ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు నాగరాజు, సుడా మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, తదితరులు మదన్‌లాల్ పార్థివదేహానికి నివాళులర్పించారు.

# 11న హౌసింగ్ బోర్డు స్థలాల వేలం

- కూకట్‌పల్లిలో నివాస స్థలం చదరపు గజం ధర 1.25 లక్షలు
- వాణిజ్య స్థలం ధర 1.50 లక్షలు

హైదరాబాద్, మే 28(నమస్తే తెలంగాణ): కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ ఫేజ్-7 పరిధిలో 4 నివాస, 15 వాణిజ్య ప్లాట్లకు వచ్చే నెల 11న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. నివాస ప్లాట్ల ధర చదరపు గజానికి రూ.1.25 లక్షలుగా, వాణిజ్య ప్లాట్ల ధర రూ.1.50 లక్షలుగా నిర్ణయించారు. నివాస ప్లాట్ల వైశాల్యం కనిష్ఠంగా 194 గజాలు, వాణిజ్య ప్లాట్ల వైశాల్యం 800 నుంచి 920 గజాల వరకు ఉంది. హౌసింగ్ బోర్డుకు హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో 4609 ఎకరాలు ఉండగా, అందులో 3820 ఎకరాల్లో ఇదివరకే కాలనీలు నిర్మించారు. మిగిలిన 789 ఎకరాల్లో 80 ఎకరాలపై కోర్టులో కేసులు ఉండగా, 610 ఎకరాలు క్లియర్‌గా ఉన్నాయి. 150 ఎకరాల భూమిని లీజుకు ఇచ్చారు. 100 ఎకరాలు జేఎన్‌టీయూకు ఇవ్వగా, మిగిలినవి వివిధ సంస్థలు, వ్యక్తులకు ఇచ్చారు. నిధుల సమీకరణలో నిమగ్నమైన సర్కారు దృష్టి ఈ ఆస్తులపై పడింది. ఆస్తుల స్థితి తదితర వివరాలతో కూడిన నివేదికను అధికారులు ప్రభుత్వానికి అందించారు. నిధుల సమీకరణలో భాగంగా ప్రభుత్వం ఈ భూములను విక్రయించాలని నిర్ణయించింది.

# యాదగిరిగుట్టలో చింతపండు చోరీకి యత్నం

**ప్రసాద విక్రయశాల నుంచి 10 బస్తాలు తరలిస్తూ పట్టుబడ్డ సురక్ష సిబ్బంది**


చోరీకి వినియోగించిన కారు

యాదగిరిగుట్ట, మే 28: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పని చేసే సురక్షా సిబ్బంది మంగళవారం అర్ధరాత్రి చింతపండు బస్తాలను దొంగిలించేందుకు యత్నించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు డీఈవో భాస్కర్‌శర్మ మీడియాకు వెల్లడించారు. కొండపైన స్వామివారి ప్రసాద విక్రయశాలలోని గోదాంలో పులిహోరలో వినియోగించే 30 కిలోలు గల 10 బస్తాల చింతపండును మధు, గణేశ్ అనే సురక్షా సిబ్బంది కన్వేయర్ బెల్టు సాయంతో కారులో వేసుకుని బయటకువెళ్లే ప్రయత్నంచేశారు. ఎస్పీఎఫ్ సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేయగా కారుతోపాటు చింతపండు బస్తాలను వదిలేసి పారిపోయారు. యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డీఈవో వెల్లడించారు.

### అధికారుల హస్తంపై విచారణ చేపట్టాలి: బీఆర్‌ఎస్

దేవస్థానానికి సంబంధించిన చింతపండు దొంగతనంలో ఆలయ ఉన్నతస్థాయి అధికారుల హస్తం ఉన్నట్టు బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి ఆరోపించారు. బుధవారం కొండపైన ఘటనాస్థలాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. అర్ధరాత్రి గోదాం, ప్రసాద తయారీ కేంద్రాల తలుపులు, తాళాలు తీసి ఉండటం పలు అనుమానాలకు తావిస్తున్నదని తెలిపారు. దొంగతనానికి ఉపయోగించిన కారు అర్ధరాత్రి కొండపైకి ఎలా వెళ్లిందో ఆలయ అధికారులు విచారణ చేపట్టాలని తెలిపారు. దేవస్థాన ఉన్నతస్థాయి అధికారుల ప్రమేయం ఉందని ఆరోపించారు. ఎన్నేళ్లుగా చింతపండు దొంగతనం జరుగుతుందో విచారించాలన్నారు. తెలంగాణ తిరుపతిగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట దేవస్థానంలో చింతపండుకే రక్షణ లేకపోవడం చూస్తుంటే స్వామివారికి సమకూరిన బంగారం, వెండి నగల రక్షణపై ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఉందన్నారు.

# రాష్ట్రంలో ఆర్టీఐ చట్టం పనిచేస్తున్నదా..?


**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రుద్రమ**

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆర్టీఐ చట్టం పనిచేస్తున్నదా? అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ ప్రశ్నించారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో 16వేల ఆర్టీఐ అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జనవరి 31న బీజేపీ తరఫున 27ప్రశ్నలకు అప్లికేషన్లు ఇచ్చినా ఎలాంటి సమాధానం ఇవ్వలేదని ఆందోళన వ్యక్తంచేశారు. మార్చిలో మళ్లీ అప్పీల్ చేసినా ఫలితం శూన్యమని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పుల వివరాలను ఆర్టీఐ ద్వారా వివరాలు కోరితే ఇవ్వకపోవడం ఏమిటని మండిపడ్డారు. కాంగ్రెస్ ఆర్టీఐ చట్టాన్ని నిలిపివేసిందా? అని ప్రశ్నించారు. దేశమంతటా పనిచేస్తున్న ఆర్టీఐ యాక్ట్ రాష్ట్రంలో మాత్రం ఎందుకు పనిచేయడం లేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

# తహసీల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- ఇబ్రహీంపట్నం ఆర్‌ఐ కృష్ణను అదుపులోకి తీసుకున్న అధికారులు
- ఆదిభట్లలో 7 గుంటల భూమిని ఆన్‌లైన్ చేయడానికి 12 లక్షల డిమాండ్

ఇబ్రహీంపట్నం, మే 28 : రంగారెడ్డిజిల్లా ఇబ్రహీంపట్నం తహసీల్ కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి ఆర్‌ఐ కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిభట్లకు చెందిన ఇమ్మిడి బాలకృష్ణ తనకు సంబంధించిన 7 గుంటల భూమి ఆన్‌లైన్‌లో రావడంలేదని ఆర్‌ఐ కృష్ణను ఆశ్రయించాడు. దీంతో ఆర్‌ఐ రూ.12 లక్షలు డిమాండ్ చేయగా రూ.9 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పని పూర్తి అయ్యిందని, డబ్బులు ఇవ్వాలని ఆర్‌ఐ వేధిస్తుండటంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఫోన్‌లో మాట్లాడిన విషయాన్ని రికార్డుచేసి ఆధారాలను ఏసీబీకి సమర్పించారు. ఈ ఆధారాలతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు కార్యాలయానికి వచ్చి ఆ భూమికి సంబంధించిన ఫైల్‌ను స్వాధీనం చేసుకుని, ఆర్‌ఐని అదుపులోకి తీసుకున్నారు.


ఇబ్రహీంపట్నంలో ఆర్‌ఐ కృష్ణను అదుపులోకి తీసుకుని భూపత్రాలను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు